అడగనిప్రశ్న

కె.గోదావరిశర్మ

గది నిండా చీకట్లు కమ్ముకుంటున్నా లేచి లైటు వెయ్యడానికి బద్ధకించి అలా పడుకునే ఉండిపోయాడు భీమేశ్వరరావు. బయటి వాతావరణం లాగే మనసు కూడా స్తబ్ధంగా, జడంగా ఉంది.

తలుపు మీద చేతి వేళ్ల కణుపులతో టక్ టక్‌మని శబ్దం చేస్తూ 'జైభీమ్' అని పిలిచేడు కుమారస్వామి. శుద్ధ శ్రోత్రియుడైన భీమేశ్వరరావుని 'జై భీమ్' అని పలకరించడం కుమారస్వామికి సరదా.

లేచి లుంగీ సర్దుకుని లైటు వేసి తలుపు తీశాడు భీమేశ్వరరావు.

"ఈ సమయంలో లేవ్‌లో ఉంటావనుకున్నాను. రూమ్‌లోనే ఉన్నావేం?" అన్నాడు కుమారస్వామి లోపలికొస్తూ. లేవ్ అంటే లేవెటరీ కాదు, లెవొరేటరీ. అప్పుడప్పుడు మాటల్లోని బకారాలని వకారాలుగా మార్చి అన్- బెంగాలీగా మాట్లాడడం కుమారస్వామికి సరదా. ఆ సూత్రం ప్రకారం లేబొరేటరీ లేవొరేటరీ అయి, లేవ్ అని సంక్షిప్తీకరించబడింది. ఏదైనా పెద్దగా తేడా లేదు కదా అని అతడి వివరణ.

"లేబ్ కెళ్లాలనిపించలేదు. బోర్‌గా ఉంది" అన్నాడు భీమేశ్వరరావు, మళ్లీ మంచం మీద వాలుతూ.

"రెస్ట్ కోసం ఇంటికెళ్లిన వాడివి రెండు రోజుల్లోనే బూమ్‌రేంగ్ అయ్యేవు! ఏమయినా విశేషమా, ఇంట- రెస్ట్ లేకా?" మిత్రుణ్ణి నిశితంగా పరిశీలిస్తూ అడిగేడు కుమారస్వామి.

"విశేషమూ లేదు పాడూ లేదు. ఆ ఊరు, ఆ ఇల్లు, ఆ మనుషులు – ఎన్నేళ్లయినా అంతే! అక్కడ సామాన్యాలే గాని విశేషాలు ఉండవు. నిన్న రాత్రే వచ్చేశాను" అన్నాడు భీమేశ్వరరావు విసుగ్గా. ఈ మాటలు చెపుతున్న సమయంలోనే టేబుల్ మీది పుస్తకం ఒకటి తీసి పేజీలు తిరగేసి మళ్లీ అక్కడే పడేశాడు విసుగ్గా.

"నిన్న రాత్రే వచ్చేశావని ఉదయం తెలిసిందిలే. మీ కొలీగ్ లేడూ – బొద్దింక మీసాలు వాడు – వాడు చెప్పేడు పోనీ, వచ్చేశావు. మంచి పని చేశావులేగానీ, లే! బి ఎ మేన్! మేన్! అలా నిరాశగా, నిర్లిప్తంగా, నిస్పృహగా, నిస్తేజంగా, నికృష్టంగా – నో, నో, సారీ నికృష్టంగా ఇక్కడ వాడకూడదు– ని ... ని ... నిర్జీవంగా అలా పడి వుండడం ఏం బావో లేదు. లే. పద!" అని ఉత్సాహపరిచాడు కుమారస్వామి, "అలా బీచ్‌కి పోయి కాస్త హవాఖానా చేద్దాం".

నిర్జీవంగానే ఓ నవ్వు నవ్వేడు భీమేశ్వరరావు. "హవాఖానాయే చెయ్యాలిలే. ఇంకేం తినడానికీ ఇంకేం డబ్బుల్లేవు" అన్నాడు లేచే ప్రయత్నం చెయ్యకుండా.

"డబ్బుదేముందోయ్, కుక్కని కొడితే రాలుతుంది" అన్నాడు కుమారస్వామి తేలిగ్గా.

"ఏదీ పద. ఓ కుక్కని కొట్టి చూద్దాం! ఏం రాలుతుందో! అప్పుడు మనం హవాఖానాకి బదులు దవాఖానాకి వెళ్లాలి." స్వామి సన్నిధిలో నిరాశాజనకుడికి కూడా ఆశ కలగకపోయినా హాస్యం పుడుతుందేమో!

"ఈవేళ ఉదయమే కొట్టేనోయ్– కుక్కని కాదు గాని, మా కుక్కుని– వంద రాలింది" ఉత్సాహంగా చెప్పేడు కుమారస్వామి.

"కుక్కునా? చివరికి మీ వంటావిడ దగ్గర కూడా అప్పులు చేస్తున్నావన్నమాట!"

"కుక్కు అనగా వంటమనిషి కాదు నాయనా! అసలు మా వంటమనిషి పని మానేసి వారం రోజులైంది. ప్రస్తుతం ఇంటావిడే వంటావిడ. ఆవిడ తాళింపు డబ్బాలోంచి షంద రూపాయలు రాలితే ఇంకేం కావాలి?– ఇంతకీ, కుక్కు అనగా ప్రొఫెసర్ ఎస్కే రావ్ అనబడే మా కుక్కుటేశ్వరరావు. అది అతని కరంట్ పెట్ నేమ్. ఉదయం కనిపిస్తే ఎందుకైనా మంచిదని ఎప్పుడూ లేనిది వందనం చేసేను. 'వంద' అన్నాను, 'నముులు' అనకుండా నీళ్లు నములుతూ, ఆనందాశ్చర్యాలతో చూస్తూ, 'ఇంద' అని తీసి ఇచ్చాడు. పుచ్చుగు చక్కా వచ్చాను. 'థాంక్స్ ఫర్ యువర్ బొంద' అని బెంగాలీగా అనుకుంటూ".

"అందులో – ఆ వందలో – ఇప్పుడెంత మిగిలింది?" ఆశకి ఊపిరి పోస్తూ అడిగాడు భీమేశ్వరరావు.

కుమారస్వామి జేబులోంచి విలాసంగా ఖడక్ నోటు తీసి దానిమీద వేళ్లతో (చిరిగిపోకుండా జాగ్రత్తగా) కొడుతూ, "ఆసచర్యం! ఆసచర్యం!" అన్నాడు.

ఎడమ చేత్తో ఆ నోటూ కుడి చేత్తో హేంగర్‌కున్న తన చొక్కా అందుకుని మొదటి దాన్ని రెండో దాంట్లో భద్రపరిచేడు భీమేశ్వరరావు.

"అన్నన్యాయం! అన్నన్యాయం!" అని హాహాకారాలు చేస్తూ గోలపెట్టేడు కుమారస్వామి.

"అయినా ఇదేం పనోయ్. కుక్కుని కొట్టి తెచ్చుకున్నది డేగ తన్నుకుపోయినట్టు ..." అని మొసలి కన్నీరు కార్చేడు.

భీమేశ్వరరావు లేచి షర్టు శరీరానికి ఎక్కించి, జేబులోంచి గుండెలోకి బలాన్ని పీల్చుకున్నాడు.

"అయినాగాని ఇంటికెళ్లిన వాడివి పాతికో, పరకో తెచ్చుకోకుండా వచ్చేశావేం?" అన్నాడు కుమారస్వామి. దృష్టి అతడి జేబుమీదే నిలిపి.

"వచ్చేటప్పుడు మూడ్ బాగాలేదు. వాళ్లని అడగాలనిపించలేదు" అన్నాడు భీమేశ్వరరావు. మళ్లీ సీరియస్‌గా అయిపోతూ.

"వాళ్లు అనగా ఎవరోయ్? మీ నాన్నే కద? లక్షలాది రూపాయలు సంపాదించి పల్లెటూళ్లో కూర్చున్నాడు కద! యూనివర్సిటీలో రిసెర్చి చేస్తున్న కొడుకు ఇంటికి వచ్చి వెళుతున్నప్పుడు వందో యాభయ్యో ఇవ్వాలని తోచదూ?"

"తోచదు. అదే మా వాళ్ల ప్రత్యేకత. నాకేం, తెలివైనవాణ్ణి, ఎలాగైనా బతికేస్తాను. పాపం, మా అన్నే. వెర్రిబాగులవాడు. ఈ మధ్య మళ్లీ తులంన్నర వెంకటేశ్వరస్వామి ఉంగరం చేయించుకున్నాడు నాలుగో వేలికి. మా నాన్నే ముచ్చటపడి చేయించేడుట ..."

"మీ అన్న అంటే మీ ఊళ్లో ఎల్. ఐ సీ ... ఆ అన్నేనా?"

"ఆఁ! ఉన్నదే ఒక్క అన్న!"

"ఐసీ! కారణం ఏమిటంటావ్?"

"కారణం ఏమిటి? మా అన్న తరవాత నేనే పుట్టేను. మధ్యలో ఇంకెవరూ లేరు. అంచేత నాకు ఒక్కడే అన్న –"

"ఛ ఛ! అది కాదోయ్! మీ నాన్న, మీ అన్నపట్ల ఆ విధంగా, నీపట్ల ఈ విధంగా ప్రవర్తించడానికి కారణం ఏమిటీ అని అడుగుతున్నాను".

"అదా! ఏముంది? మొదటి నుంచీ మా అన్న బుద్ధిమంతుడు. అంటే చెప్పిన మాట విని గంగిరెద్దులా తల ఊపుతాడు. నాకు బుర్ర తిరుగుడు. ఎందుకంటే వాళ్లు చెప్పినది తప్పో రైటో, మంచో చెడో ఆలోచిస్తాను నేను ..."

"ఇకనేం? తాళం వెయ్–"

"మా నాన్న మాటకా?"

"ఛ ఛ కాదోయ్. రూమ్‌కి. బయటికి వెళుతున్నాం కదా" టేబుల్‌మీద తాళం కప్ప, చెవి తీసి మిత్రుడికి అందించేడు కుమారస్వామి.

ఇద్దరూ హాస్టల్ విడిచి రోడ్డున పడ్డారు.

"సరేగాని నీ జేబులో ఉన్న ఆ శతమానం మార్చి నా మొహాన ఓ ఎనభై పడేసి మిగతాదంతా నువ్వే ఉంచుకో" నిష్పత్తి నిరుకు చేసుకున్నాడు కుమారస్వామి.

"సరే" నవ్వేడు భీమేశ్వరరావు.

* * * * * * *

ఓ దశాబ్దం కిందట భీమేశ్వరరావు, కుమారస్వామి తొమ్మిది, పది తరగతులు చదువుతూ ఉండేవా రు. ఇద్దరిదీ ఒకే ఊరు కాకపోవడం వల్ల ఇద్దరికీ పరిచయం లేదు. కుమారస్వామి టెన్త్ పరీక్ష తప్పి, పునాది దిట్టం చేసుకొని, భీమేశ్వరరావుతో సమాన స్థాయికి వచ్చాడు. **అయిదేళ్ల తరువాత ఇద్దరూ**

యూనివర్శిటీలో వేర్వేరు డిపార్టుమెంట్లలో ఎం.ఎస్సి. కోర్సులో చేరేరు. అదయ్యాక రిసెర్చిలో చేరేరు. నాలుగేళ్లపాటు హాస్టల్స్‌లో రూమ్‌మేట్స్‌గా గడపడంవల్ల వాళ్ల స్నేహం కలిసి, బలిసింది.

భీమేశ్వరరావు తెలివైనవాడు. శాంత గంభీరుడు. కుమారస్వామికి చదువులో శ్రద్ధ తక్కువైనా చురుకైనవాడు, మంచివాడు. లోకజ్ఞానం చాలా ఉంది. ఎక్స్‌ట్రా కరికులర్ ఏక్టివిటీస్ ఎక్కువ. అతడు గత సంవత్సరమే యూనివర్సిటీలో లెక్చరరు అయ్యాడు. థీసిస్ సబ్మిట్ చెయ్యగానే లెక్చరర్ కావడం అదృష్టమే అన్నారు తెలియనివాళ్ళు. తెలిసిన వాళ్లకి అది అ–దృష్టం కాదు, దృష్టమే.

భీమేశ్వరరావు ఇంకా రిసెర్చి స్కాలర్‌గానే ఉన్నాడు. అతని డిపార్ట్‌మెంటులోనూ, యూనివర్సిటీలోనూ అతని కులస్థులెవరూ పని కొచ్చే పదవుల్లో లేరు. అంచేత ఇంకా కొన్నేళ్ళు అతడు అలాగే ఉండవచ్చు. ఈలోగా కుమారస్వామి రీడరు, ప్రొఫెసర్ కూడా అయిపోవచ్చు. దీనికి కారణం – కిట్టనివాళ్ళు చెప్పేదేమిటంటే – భీమేశ్వరరావు తెలివైనవాడు కావడం, కుమారస్వామి తెలివితేటలు అంతంతమాత్రం కావడమేనని. కాని 'కన్‌సెర్న్‌డ్' పెద్దల నెవరినైనా కాస్త ప్రైవేట్‌గా కలుసుకుని అడిగితే వాళ్ళు సిన్సియర్‌గా ఇలా అంటారు. "ఛ-ఛ! అదేం లేదండీ! యూనివర్సిటీలో ఉద్యోగాలు, ప్రమోషన్లు మెరిట్ ఉన్నవాళ్లకి ఇవ్వరని, మెరిట్ లేనివాళ్లకే ఇస్తారనీ ఒక అపప్రధ ఉంది. అది నిజంకాదు. అసలు యూనివర్సిటీ అపాయింట్‌మెంట్ల విషయంలో మెరిట్ ప్రసక్తే లేదు కదండీ! కేవలం కులం, డబ్బు– అంతే! అంతేకాని, మెరిట్‌ని చిన్న చూపు చూడాలని ఇక్కడేమీ రూల్ లేదండి. అది అబద్ధం!"

ఈ పరిస్థితిని ఎవరూ ఇదేమని ప్రశ్నించరు. ఎదిరించరు. ఇది సహజం. ఇది తప్పదు అన్నట్టు చూస్తూ ఊరుకుంటారు. అస్మదీయులు, ఆశ్రితులు, ఆర్థికులూ తమ పనులు తాము

జరిపించుకుంటారు. మిగిలినవాళ్ళు వేణ్నీళ్ళకి చన్నీళ్ళుగా ఏదో సైడ్ బిజినెస్ చేసుకోవడమో, అన్యాయాన్నీ, అవినీతినీ అంగీకరించి ధృతరాష్ట్రుల్లై జీవించడమో చేస్తారు.

* * * * * * * * * *

"అదికాదోయ్-" అని సంభాషణ కొనసాగించేడు భీమేశ్వరరావు.

ఎదురుగా బెంగాలీ అఖాతం వంగ భాషలోని బౌళ్ గీతాన్ని కోరస్‌లో పాడుతున్నట్టు హోరు పెడుతూంది.

"అసలు మొదటినుంచీ చూస్తున్నాను తెలివితేటలు, అర్హత ఉన్నవాళ్ళకి అన్యాయం జరగడం, అర్హత లేనివాళ్ళు, తక్కువ లెవెల్‌వాళ్ళూ ఎక్కువ ప్రయోజనం పొందడమూను! ఇలా ఎందుకు జరుగుతూంది?మన యూనివర్సిటీలో అంటే సరే, అంతా కరప్ట్ ఫెలోస్! కాని ఇంట్లో తల్లీ తండ్రీ కూడా అలాగే ప్రవర్తిస్తారేం? అర్హతనిబట్టి ఆదరణ-"

"లేదు. ఎప్పుడూ ఉండదు" అని మధ్యలోనే అతణ్ణి ఆపి ఒప్పుకున్నాడు కుమారస్వామి.

"ఆమధ్య ఓ కవిత చదివాను -"అందమైన నెమలికి అడవుల్లో తిండిలేక మాడే అవయోగం, కురూపి కాకికి పిండాలు తిని బలిసే అదృష్టయోగం'- అని! ఇది ఎక్కడా ఉన్నదే. తల్లిదండ్రుల ప్రేమ పిల్లలందరిమీదా సమానంగా ఉండదు. చెడిపోతున్న పిల్లల్ని గురించి బెంగ పెట్టుకుంటారు గాని బాగుపడుతున్న పిల్లల్ని ప్రోత్సహించరు..."

"ప్రోత్సహించడం కూడానా? నిరుత్సాహపరచి పాడు చేస్తూ ఉంటే!" అన్నాడు భీమేశ్వరరావు, కోపంగా, చిరాగ్గా.

"తప్పదు. వాళ్ళ టైము - ఎనర్జీ, మనీ, రిసోర్సెస్, చివరకి ప్రేమ కూడా పిల్లలందరికీ డిస్ట్రిబ్యూట్ చెయ్యాలి. మంది ఎక్కువైనకొద్దీ మజ్జిగే కాదు, మరేదైనా పలుచబడుతుంది. అందుకే కుటుంబ నియంత్రణో అని ఘోష పెట్టడం! పిల్లలు ఎక్కువయినకొద్దీ వాళ్ళ మధ్య పోటీలు, పోలికలు, తేడాలు, అసూయలు.... సమస్య చాలా కాంప్లెక్స్ అవుతుంది. అలాంటప్పుడు 'వీకర్ సెక్షన్స్'కి సహాయం ఎక్కువ అందుతుంది. పుట్టుకతోటే

అడగని ప్రశ్న

మానసికంగానో, శారీరకంగానో బలహీనంగా ఉన్నవాళ్ళంటే ఎవరికైనా సానుభూతే కద! 'అంచులేని బిందెని రెండు చేతులతో ఎత్తాలని' సామెత! తెలివి తక్కువ పిల్లల గురించి ఆందోళనపడుతూ తెలివైన పిల్లల్ని అశ్రద్ధ చేస్తారు. "వాడు ఎలాగైనా బతికేస్తాడు. వీడే పాపం ఎలా నెగ్గుకొస్తాడో ఏమో" అంటూంటారు. దీనివల్ల ఏం జరుగుతుందంటే బలహీనులు బాగుపడరు. వాళ్ళకి ఆత్మవిశ్వాసం స్వతంత్రంగా ఆలోచించడం, పనిచెయ్యడం ఎప్పటికీ రాదు. సరికదా, వాళ్ళంటే మిగిలిన పిల్లలకి అసూయ, తల్లిదండ్రులంటే కసి, కోపం పెరుగుతాయి...."

"కరక్ట్. నీ ఎనాలిసిస్ బాగుంది. నా విషయంలో సరిగ్గా అలాగే జరిగింది. మా అన్నకి బుర్ర లేకపోవడమే వాడి క్వాలిఫికేషను కాగా, నా తెలివితేటలే నాకు డిస్ క్వాలిఫికేషను. అయితే మా వాడి దగ్గర ఒకటుంది- కింగ్ లియర్ పెద్ద కూతుళ్ళు ఇద్దరూ చూడు - తండ్రి మెప్పుకోసం ఇచ్చకం మాటలాడతారు! అలా తియ్యగా, డ్రమెటిక్‌గా, సినిమాటిక్‌గా మాట్లాడతాడు. అంటే- మాతృదేవోభవ, పితృదేవోభవ, పెద్దలను గౌరవింపుము - లాంటివి. దాన్తో మావాళ్ళు ఐస్‌ఐపోతారు. నేనేమో కార్డీలియాలాంటివాడిని. నిజం చెబితే ఎప్పుడూ నిష్ఠూరమేకదా!" నిట్టూర్చేడు భీమేశ్వరరావు.

"మరింకేం? విషయం ఏమిటో సరిగ్గా విశ్లేషణ అయిపోయింది కద? ఇది లోక సహజం. దీన్ని చూసి ఆశ్చర్యపడక్కర్లేదు.' అన్నాడు కుమారస్వామి.

"మన యూనివర్సిటీలో అవకతవకలలాగానా?" కోపంగా అడిగాడు భీమేశ్వరరావు.

"లోకంలో చాలా అన్యాయాలు చాలా కాలంగా జరుగుతున్నాయి అదే మన సంప్రదాయం అని, అలా జరగక తప్పదనీ చాలామంది అనుకోవచ్చు. కాని అది సమర్థనీయం కాదు. తేడా తెలిసినవాళ్ళు దాన్ని ఎదిరించాలి" అన్నాడు.

కుమారస్వామి కొంచెం గిల్టీగా తల గోక్కున్నాడు. "నిజమే అనుకో! కాని మనకి నచ్చినా నచ్చకపోయినా కొన్ని విషయాలని గమనించక తప్పదు. నీలాంటి ఆదర్శ యువకులు ధర్మాధర్మాలు, నీతి – అవినీతులు, న్యాయా న్యాయాల గురించి ఆలోచిస్తారు. ఎందుకంటే మనుషులంతా సమానమే అన్న భావనలో ఉంటారు కనక. కాని చాలామంది పెద్దలకి – వయస్సులోగాని, అధికారంలో గాని, డబ్బులోగాని – ఈ అందరూ సమానమే అన్న భావం మింగుడుపడదు. అది వాళ్ళ పెద్దరికానికి దెబ్బ కదా! అంచేత పెద్దవాళ్ళకి విధేయత ప్రధానం. ఒక ఆఫీసర్ మెప్పు పొందాలంటే సబార్డినేట్ సమర్థుడైతే ఉపయోగం లేదు. విధేయుడై ఉండాలి. అసలా ఆఫీసరు కంటే గుమాస్తా తెలివైనవాడైతే ఆఫీసరు పనిలో తప్పులెంచడూ? అంచేత బాస్ మాటే వేదం. బాస్ తప్పు చేసినా అది రైటన్న సబార్డినేట్లకే మంచి రిమార్కులు, రిపోర్టులు, రవార్డులూను. మరి, అదే సూత్రం ఇంట్లో కూడాను. పిల్లలు తమ మాట వింటున్నంత కాలం పెద్దవాళ్ళు వాళ్ళని వాత్సల్యంతో చూస్తారు. మాట వినకపోయేసరికి వాళ్ళ అహంకారం దెబ్బతింటుంది. ఎంత శిక్ష వెయ్యటానికైనా వెనుదియ్యరు. అప్పుడు అందులోను ఇద్దరు పిల్లలు ఉండి, ఒకరు తమకి విధేయంగా ఉన్నప్పుడు రెండోవాడు తక్కువ విధేయత కనబరిస్తే అది పెద్ద నేరమే. నువ్వేమో మీ నాన్న ఏదైనా అంటే, "అదేమిటి నాన్నా, పెద్దవాడివై, ఉండి అలాంటి తప్పు మాట' అంటావు" అన్నావనుకో, మీ నాన్నకి కోపం వచ్చి తీరుతుంది. సహజం.

"సహజం అంటే అది ఆ మనిషి బలహీనత. దానిని మనం ఎందుకు సమర్థించాలి? ముసలాళ్ళు సరే. వాళ్ళకి పెద్దరికమూ అహంకారమే ప్రధానం. పిల్లల నుండి వాళ్ళు ఆశించేది విధేయతే. కాని మా అన్న – ముసలాడు కాదే! మరి వాడికి నీతి, న్యాయం వద్దా? మా నాన్న ఏదంటే దానికి తందానతాన అనడమేనా?"

"అదే లాభసాటి కదా! మీ అన్న వయసులో ముసలాడు కాకపోవచ్చు. కాని 'కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు' కదా! లేదా అవకాశవాది గాని సంప్రదాయవాది గాని కావచ్చు. రెండూ ప్రమాదమే. పితృ వాక్య పరిపాలన మన సంప్రదాయం కదా! నీలాంటి వాళ్ళు, కార్డీలియాలాంటి వాళ్ళకి జీవితాంతం బాధలు తప్పవు. అదే పరశురాముడి కథ చూడు! తండ్రి తల్లిని చంపమనగానే నిస్సంకోచంగా గొడ్డలితో నరికేశాడు. కన్నతల్లిని! మాతృదేవోభవ అన్న ఈ గడ్డ మీదనే! అయినా పరశురాముడు హీరోనే. పితృ వాక్య పాలనలో శ్రీరాముణ్ణి మించిపోయాడు కద! అదీ కథ! అంచేత సుఖపడదలచుకున్నవాళ్ళు పెద్దల యెడ గౌరవంతో, సంప్రదాయబద్ధులై, న్యాయాన్యాయ విచక్షణ పెట్టుకోకుండా హాయిగా గడుపుతారు". కుమారస్వామి గొంతులో వ్యంగ్యమూ నిజాయితీ ఆశ్చర్యంగా కలిశాయి.

"మరి నువ్వు? నువ్వు ఎటు వైపు?" అని అడగలేదు భీమేశ్వరరావు. అడిగి అతడి స్నేహాన్ని వదులుకోలేక.

మిత్రులిద్దరూ యూనివర్సిటీ కాంపస్‌కేసి తిరుగుముఖం పట్టారు. □